క్లుప్తంగా

రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు

- గ్రీన్ పార్క్ రోడ్డులో బడ్డీల తొలగింపు



గ్రీన్‌పార్క్ రోడ్డులో క్రేన్లతో బడ్డీలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది, పోలీసులు

అల్లిపురం: ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉండి వ్యాపారాలు చేసుకుంటున్న తమని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 5 దశాబ్దాలుగా గ్రీన్‌పార్కు రోడ్డులో విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద చిన్న చిన్న బడ్డీలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గురువారం ఉదయం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, మహారాణిపేట పోలీసులు క్రేన్లు, లారీలతో తరలించారు. దీంతో చిరువ్యాపారులు గత ప్రభుత్వంలో వ్యాపారాలు చేసుకునేందుకు ఆర్థికంగా సహకారం అందించి ఆదుకుంటే, కూటమి ప్రభుత్వం వచ్చి తమ పొట్ట కొట్టిందని వాపోయారు. బడా వ్యాపారులకు అన్ని సౌకర్యాలు సమకూర్చిన ప్రభుత్వం చిరు వ్యాపారులను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ కనీసం స్పందించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన అడ్‌హక్ కమిటీ నియామకం

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుల నియామకం గురువారం ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ డ్రైవర్ల సమస్యల తక్షణ పరిష్కారానికి డి.వెంకట రామారావు, మహ్మద్ ఉమర్ జాన్, డి.శేషసాయి రాజు, వి.జగదీశ్వరరావు, పిల్లి నాయుడు, కె.రామారావు, రాజు, ప్రకాష్, బాబూరావు, వై.సత్యనారాయణతో కూడిన 10 మంది సభ్యులతో కూడిన అడ్‌హక్ కమిటీ నియామకం జరిపినట్టు చెప్పారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి, అధ్యక్షుడు, కార్యదర్శులను ఎన్నుకుంటామన్నారు. నూతన అడ్‌హక్ కమిటీ సభ్యులను అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్‌వీకే వర్మ, తాతారావు, ప్రసాద్ తదితరులు అభినందించారు.

తప్పిపోయిన 2 గంటల్లోనే బాలుడి ఆచూకీ లభ్యం



కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: తప్పిపోయిన మూడున్నరేళ్ల బాలుడిని రెండు గంటల్లోనే వన్‌టౌన్ పోలీసులు వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తన సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టౌన్ కొత్తరోడ్డుకు చెందిన నాయుడు తన భార్యతో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నాడు. వీరి మూడున్నరేళ్ల కుమారుడు రిత్విక్‌రాజ్‌తో కలిసి బయటికి వెళ్లేందుకు గురువారం ఉదయం వచ్చారు. ఈ క్రమంలో రిత్విక్ వారి నుంచి తప్పిపోయాడు. తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జీడీ బాబు స్పందించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



జ్ఞానాపురం ఫ్లై ఓవర్ కింద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



పాత పోస్టాఫీసు వద్ద కన్వేయర్ బెల్ట్ నీడలో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

ఇక్కడ ఇవే బస్ షెల్టర్లు

- కన్వేయర్ బెల్ట్, చెట్ల నీడ, ఫ్లై ఓవర్ల కింద ప్రయాణికుల నిరీక్షణ
- ఇబ్బంది పడుతూనే ప్రయాణాలు
- పట్టించుకోని అధికారులు



పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

జగదాంబ:

విశాఖ అంటే ఒకప్పుడు పాతనగరమే. సిటీ అంతా అక్కడి నుంచే విస్తరించింది. నగరంలోని అన్ని ప్రాంతాల వారు గతంలో టౌన్ అని పిలుచుకునే పాతనగరం తర్వాతి కాలంలో అభివృద్ధిలో వెనుకబడిపోయింది. పెద్దగా ఎలాంటి మార్పు కానరాని పాతనగరంలో ప్రజల సౌకర్యాల్లో కూడా మార్పు గోచరించదు. ముఖ్యంగా ఇక్కడి చాలా ప్రాంతాల్లో బస్ బేలు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మారుమూల పల్లెల్లో కూడా బస్ బేలు ఏర్పాటు చేసిన ఈ రోజుల్లో పాతనగరంలో బస్ బేలు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అన్ని బస్సులు పాతనగరంలోని పెద్ద పోస్టాఫీసు వద్దకు వస్తాయి కానీ అక్కడ బస్టాప్ లేకపోవడం విడ్డూరమనే చెప్పుకోవాలి. పాతపోస్టాఫీసు మీదుగా పోర్టుకు వెళ్లే కన్వేయర్ బెల్ట్ నీడలోనే ప్రయాణికులు తాము ప్రయాణించాల్సిన బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. సమీపంలో ఉన్న రాణి విగ్రహం వద్ద గల ఓ చెట్టు ప్రయాణికులకు నీడనిస్తూ తానే బస్టాప్‌గా సేవలందిస్తోంది. అలాగే జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా జంక్షన్ వద్ద గొడుగుల నీడలో విద్యార్థులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటే, పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద ఎండలోనే ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు పడుతూ కనిపిస్తారు. అలాగే జ్ఞానాపురంలో బస్ బే లేకపోవడం వల్ల అక్కడి ఫ్లై ఓవర్ కింద నిలబడి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. ఇలా దక్షిణ నియోజకవర్గంలోని ప్రధాన ప్రాంతాల్లో బస్ బేలు లేక అష్టకష్టాలు పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



రామకృష్ణా జంక్షన్‌లో గొడుగు నీడలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు



రాణిబొమ్మ వద్ద చెట్టు నీడలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రాజీవ్ కుటుంబ సభ్యులు

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ గురువారం కుటుంబ సమేతంగా కలిశారు. రాజీవ్ కుటుంబం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన సమయంలో జగన్ ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ రాజీవ్ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇది పునర్జన్మ అని, నిండు నూరేళ్లు బాగుండాలని ఆశీర్వదిస్తూ, కష్టపడి పని చేయాలని, ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తు ఉంటుందని జగన్ రాజీవ్‌కి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్‌కు రాజీవ్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మోసగించడమే బాబు నైజం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దొడ్డి బాపూ ఆనంద్ తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు బొడ్డు నాయుడుతోట బూత్ నంబరు 206లో గురువారం ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ అధ్యక్షుడు రామూ మాస్టార్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. గడప గడపకు వెళ్లి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. నాగరాజు, కాండ్రేగుల నాయుడు, పిలకా మోహన్, త్రినాథ్, విశాల్, గోవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ అసహనం



ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్



తాటిచెట్లపాలెంలో అపరిశుభ్రతపై మండిపడుతున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా నిర్వహించకపోవడంతో కమిషనర్ కేతన్‌గార్గ్ సంబంధిత శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం జోన్-5 పరిధి 47వ వార్డు కప్పరాడ, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య పనుల నిర్వహణ సరిగ్గా జరగడం లేదని, వ్యర్థాలు రోడ్లు, కాలువల్లో అస్తవ్యస్తంగా కనబడుతున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. వార్డు పరిధి 260, 270 సచివాలయ శానిటరీ కార్యదర్శులు నందకిషోర్, ఝాన్సీల మొబైల్ ఫోన్ ద్వారా ముఖ గుర్తింపు హాజరు పరిశీలించి, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రోడ్డుపై ఉన్న వ్యర్థాలను క్లాప్ వాహనం ద్వారా తరలిస్తుండడం గమనించి, వ్యర్థాలు రోడ్లపై ఎందుకు పడతున్నాయని ఆరా తీయగా కొండవాలు ప్రాంతం అయినందున పైన ఉన్న వ్యర్థాలు పుష్‌కార్ట్ ద్వారా సేకరించి ఇక్కడ డంపింగ్ చేసి, క్లాప్ వాహనం ద్వారా తరలిస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమిషనర్‌కు తెలిపారు. కాలువలు దాటి రోడ్లపై దుకాణాలు ఉండడం గమనించి, లోపల ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కాలువలు దాటి రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా దుకాణాలు వెనక్కి తరలించాలని ఆదేశించారు. రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి, వాహనాల కింద ఉన్న వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెంలో అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు.

బాల్యం విద్యార్థులకు కమిషనర్ అభినందన

డాబాగార్డెన్స్: బాల్యం కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్‌ను ఆదేశించారు. గురువారం జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జీవీఎంసీ బాల్యం విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఈ నెల 7న జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ కనబరచిన మల్కాపురం, చెంగల్రావుపేట బాల్యం కేంద్రాల్లోని నాలుగేళ్లలోపు విద్యార్థులు కారే హరి శిశిక, డోమనా గ్రీష్మ ఆంగ్ల పద్యాల కేటగిరీలో విజేతలుగా నిలిచారని, ఆర్‌పీపేట, ప్రగతినగర్ బాల్యం కేంద్రంలోని నాలుగేళ్ల చిటికెల హాన్విక, పిల్లి ప్రణతి ఫ్యాన్సీ డ్రెస్ కేటగిరీలో విజేతలుగా నిలిచారని, వీరికి ఢిల్లీలోని చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ నిర్వాహకులు మెడల్స్, షీల్డ్స్, ధ్రువీకరణ పత్రాలు అందించారని కమిషనర్ పేర్కొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్ హెచ్.శంకర్రావు, బాల్యం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాల్యం విద్యార్థులతో కమిషనర్ కేతన్‌గార్గ్

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జగనన్న సంతకం చెరిపేయాలనే బాబు కుట్ర

- వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం
- ఓర్వలేక బాబు ప్రైవేటీకరణ ఎత్తుగడ
- పేద విద్యార్థులు డాక్టర్లు కాకూడదా బాబూ?
- మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి



పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జననేత జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాడేరులో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకత్వంలో శుక్రవారం పాడేరు మెడికల్ కాలేజీ వద్ద చేపట్టనున్న ధర్నా దద్దరిల్లనున్నదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 28 కార్లు, ఒక బస్సుతో దక్షిణ నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు పాడేరు కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వీటిలో 10 కళాశాలల నిర్మాణానికి రూ.4,500 కోట్లు అవసరమన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇందుకు నిధుల్లేవని, పేద విద్యార్థులు డాక్టర్లు కాకూడదనే చంద్రబాబు ఈ దుర్మార్గపు ఆలోచనకు తెర తీశారని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీట్లు రావని ఆందోళన వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ కోటాలో యాజమాన్యం సీట్లు అమ్మేసుకుంటుందని విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరులో మెడికల్ కళాశాల వస్తే గిరిజనులు అత్యవసర సమయాల్లో కేజీహెచ్‌కు వచ్చే దుస్థితి తనప్పుతుందన్న ముందు చూపుతోనే జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. చలో పాడేరు మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న 41వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు వార్డు వైఎస్సార్‌సీపీ శ్రేణులు లెబన్సీ మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వేళంగిణిరావు మాట్లాడుతూ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ దంపతుల సేవలు ఆదర్శనీయమన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్ యాదవ్, దాలిబాని మధు, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే వ్యక్తిత్వ వికాసం



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపక బృందం



డ్యాన్స్ పోటీలో ప్రతిభ చూపుతున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు డిబేట్, డ్యాన్స్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలు పెంచుకుంటారన్నారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రభుత్వ కళాశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. డిబేట్ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన వి.భవానీ, సీహెచ్ తరణి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.జయ, పాజిటివిటీ ఆర్గ్యుమెంట్‌లో మూడు స్థానాల్లో నిలవగా, నెగిటివిటీలో జి.వైష్ణవి, ఎస్.తులసి, కె.శిరీష మూడు స్థానాల్లో నిలిచారు. సోలోసింగ్ పోటీలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.జ్యోతి, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి బి.దేవి, డి.జ్యోతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ సింగింగ్‌లో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఝాన్సీ అండ్ టీం, సాహితీ అండ్ టీం, ఎలీసా టీం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. డ్యాన్స్ పోటీల్లో సౌమ్య అండ్ టీం (విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల), కృష్ణవేణి అండ్ టీం (శ్రీకాకుళం), అను అండ్ టీం (చింతపల్లి) విజయం సాధించాయి. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కేఎల్ శిరీష, బి.రాధమ్మ, విజయ ప్రశంస, జి.జ్యోతి ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల బంద్ విజయవంతానికి పిలుపు

డాబాగార్డెన్స్: స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న చేపట్టనున్న బంద్ విజయవంతం చేయాలని ఆలిండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైడర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. విశాఖ జిల్లాలో గత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారమ్‌లో పని చేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు ప్రతిరోజూ సమాజానికి సేవలందిస్తున్నా, వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక అనేక ఇబ్బందులు పడతున్నారన్నారు. చదివిన చదువుకు తగ్గ ఉపాధి లేకపోవడంతో గిగ్ వర్క్ వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందని, వారికి ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించే నాథుడే లేరన్నారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడీలను వెంటనే పునరుద్ధరించాలని, మినిమం గ్యారెంటీ వేతనం అమలు చేయాలన్నారు. పిక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలని, ఇన్సెంటివ్ విధానం ఉండాలని, ఫేక్ నోటిఫికేషన్లు తొలగించాలన్నారు. క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాలని, బేస్ ఫెయిర్ కనీసం రూ.30కి పెంచాలని, కిలోమీటరుకు సాధారణ సమయంలో రూ.10, పిక్ టైంలో రూ.12 తక్కువ లేకుండా ఇవ్వాలన్నారు. ఏడేళ్ల కిందట పెట్రోల్ ధర రూ.76 ఉన్నప్పుడే ఆదాయం బాగా వచ్చేదని, ఇప్పుడు లీటర్ పెట్రోల్ రూ.108కి పెరిగిందని, లాగెన్ హవర్స్ పెరిగాయని, ఆర్డర్స్ కూడా పెరిగాయని, నిత్యావసర ధరలు పెరిగాయని, కానీ రైడర్లకు వచ్చే ఆదాయం నానాటికీ తగ్గిపోతుందన్నారు. సమ్మెలో భాగంగా ఈ నెల 22న చలో కలెక్టరేట్, 24న ఎమ్మెల్యే కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.కుమారమంగళం, అచ్యుత్, నాని రమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ





నగరంలో చెత్తను తరలించే వాహనాల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర రోడ్లను శుభ్రంగా ఉంచాల్సిన ఈ వాహనాలే అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. చెత్తను తరలించే క్రమంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో లారీలలోని చెత్త నుంచి దుర్వాసనతో కూడిన నీరు రోడ్లపై కారుతోంది. ఫలితంగా శుభ్రంగా ఉన్న రహదారులు సైతం దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఈ సమస్య వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి, చెత్త తరలింపు వాహనాల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

35వ వార్డు వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం



వార్డు కమిటీల నియామకాల జాబితాను వాసుపల్లికి అందజేస్తున్న కనకరెడ్డి

జగదాంబ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ 35వ వార్డులో పార్టీ డివిజన్ కమిటీ, అనుబంధ కమిటీల నియామకాలను వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనల మేరకు వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. వార్డు ఉపాధ్యక్షురాలిగా సిమ్మా పుష్ప, ఉపాధ్యక్షుడిగా గొరుసు నాగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నాయిని రమేష్‌రెడ్డి, గొల్లిమాలి లక్ష్మణరావు, పిల్ల కనకమహాలక్ష్మి, మహాపాత్రుని ఈశ్వర అప్పలరాజు, కార్యదర్శులుగా చిట్టిబోయిన విజయ్, దుంగ మాలిబాబు, చప్ప లక్ష్మణరావు, తర్లాడి గోవిందులను నియమించారు. అలాగే మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోలవరపు రమణమ్మ, యువజన విభాగం అధ్యక్షుడిగా పిల్లి నాగేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఆర్. రవికుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇస్మాయిల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లండా సుధాకర్ తదితరులను ఎంపిక చేశారు.